ఎట్టకేలకు డయాలసిస్ సేవలు

మాగనూర్(మక్తల్): మక్తల్ నియోజకవర్గ వాసులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న డయాసిస్ సెంటర్ పూర్తిస్థాయి సౌకర్యాలతో ఎట్టకేలకు అందుబాటు లోకి వచ్చింది. మక్తల్ ప్రభుత్వాసుపత్రి పరిధిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బుధవారం పరిశీలించారు. గత జనవరిలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించినా.. ప్రస్తుతం పూర్తి స్థాయి సౌకర్యాలతో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. దాదాపు రూ.కోటి నలభై లక్షలతో అయిదు పడకల సామర్థ్యంతో ఈ డయాలసిస్ సేవలను ప్రజల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

త్వరలోనే అందుబాటులోకి ప్రభుత్వాసుపత్రి

గతంలో రోగులు డయాలసిస్ కోసం నారాయణ పేట, మహబూబ్ నగర్ జిల్లాలకు పోయేవారని, ప్రస్తుతం ఇక్కడే అందుబాటులోకి తేవడంతో ఇక ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రతిపక్షాలూ దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేశాయని, గతంలో అధికారంలో ఉండి కూడా మక్తల్‌లో డయాలసిస్ సెంటర్ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా ప్రాంతాలలో డయాలసిస్ సేవలను ప్రారంభిస్తే మక్తల్‌లో మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. సెంటర్ నిర్వహణ కోసం దాదాపుగా నెలకు రూ. 5 నుంచి 6 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మక్తల్‌లో 150 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభించామని.. నిర్మాణం పూర్తి చేసి త్వరలో ఆసుపత్రిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, టౌన్ ప్రెసిడెంట్ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్‌గౌడ్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల గ్రామాల్లో బుధవారం ఈదమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఎద్దుల బండలాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో 16 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన డీసీఎస్ఆర్ బుల్స్ విజేతగా నిలిచాయి. మొదటి బహుమతి ఉండవెల్లి రెడ్ల సంఘం సభ్యులు రూ.55 వేలు, రెండో బహుమతి కర్నూల్ జిల్లాకు చెందిన వరలక్ష్మికి చెందిన ఎద్దులు నిలవగా నూర్ ట్రేడర్స్, సుగుణ ఐరన్ ఏజెన్సీస్ రూ.50 వేలు అందజేశారు. తక్కశీలలో 9 జతల ఎద్దులు పోటీలో పాల్గొనగా మొదటి బహుమతి నాగర్ కర్నూల్ జిల్లాకు చంద్రకల్ గ్రామానికి చెందిన ఎద్దులు రూ.50 వేలు గెలుపొందాయి. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.


తక్కశీలలో బండలాగుడు పోటీలు

కర్ణాటక ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కఠిన చర్యలు


చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అశోక్‌బాబు


రికార్డులను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి

దామరగిద్ద: కర్ణాటకకు చెందిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ధాన్యం కొనుగోళ్లు , నిల్వల రికార్డులను పరిశీలించారు. కర్ణాటక నుంచి అక్రమంగా వచ్చే ధాన్యం విక్రయించేందుకు ఇక్కడి రైతులు తమ పట్టా పాసుపుస్తకాల ద్వారా అవకాశం కల్పిస్తే మన రైతులకు నష్టం కలగడంతో పాటు ప్రభుత్వం అందించే సన్నరకం వరి ధాన్యానికి అందించే బోనస్‌కు గండిపడుతుందన్నారు. రాష్ట్ర రైతులు కర్ణాటక రైతుల ధాన్యాన్ని తమ పాసు పుస్తకాలను ద్వారా విక్రయించినట్లు గుర్తిస్తే రైతులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కృష్ణా: కర్ణాటక నుంచి వరి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని ఎస్ఐ ఎండీ నవీద్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కర్ణాటక సరిహద్దులోని కృష్ణా చెక్‌పోస్టును బుధవారం ఎస్ఐ ఆకస్మికంగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అనుమతించాలన్నారు. అనుమతులు లేని వాహనాలను తిప్పి పంపించాలని సిబ్బందికి సూచించారు. ఎస్ఐ వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మాగనూర్: రబీ సీజన్‌లో జిల్లాలోకి కర్ణాటక నుంచి అక్రమంగా వరి ధాన్యం రాకుండా ఉండేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలని మాగనూర్ ఎస్ఐ అశోక్ బాబు ఆదేశించారు. ఈ మేరకు ఉజ్జెల్లి గ్రామ చెక్‌పోస్టును బుధవారం ఆయన పరిశీలించారు. చెక్‌పోస్ట్ దగ్గర విధులు నిర్వర్తించే పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి వరి ధాన్యం రాకుండా చూడాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించి వాహనాల నంబర్లు రిజిస్టర్‌లో నమోదు చేసుకున్న తర్వాతనే అనుమతులు ఇవ్వాలన్నారు.

క్లుప్తంగా

ఘనంగా శంభాజీ మహారాజ్ జయంతి



మరికల్: మండలంలో శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంభాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. యువత శంభాజీ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేణు, రమేష్, రాజేష్, నిఖిల్, గోవర్ధన్, చెన్నయ్య, రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



మరికల్: మండలంలోని పస్పుల గ్రామంలో నిర్మిస్తున్న మైసమ్మ ఆలయ నిర్మాణానికి ఎక్లాస్‌పూర్‌కు చెందిన కుర్వ నర్సింములు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆలయ కమిటీ సభ్యులను కలిసి రూ.51వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

వాల్మీకుల ఐక్యతను చాటుదాం



నర్వ: వాల్మీకుల ఐక్యతను చాటేందుకు గ్రామగ్రామాన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వాల్మీకి బోయ సంఘం మండల అధ్యక్షుడు కావలి అయ్యన్న అన్నారు. గత రెండు రోజులుగా జంగంరెడ్డిపల్లి, సీపూర్ గ్రామాల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు. జంగంరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షుడిగా మెట్ల కథలయ్య, ఉపాధ్యక్షులుగా మెట్ల నర్సింహా, దుప్పల్లి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా భరత్, కార్యదర్శిగా కావలి శివ, ప్రచారకార్యదర్శిగా ఉందేకోడు మూర్తి, కోశాధికారిగా కావలి కురుమయ్య, కార్యవర్గ సభ్యులుగా వెంకటయ్య, అమ్రేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవగా సీపూర్‌లో అధ్యక్ష, కార్యదర్శిలుగా గొర్ల ఆశప్ప,హనుమంతులను ఎంపిక చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం ఎస్ఐ నవీద్ దాడి చేశారు. ఈ దాడిలో హెచ్ నాగేష్, రాజు, మహ్మద్ హంజా, లక్ష్మప్ప, కరియప్పను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.29,420 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'భూ భారతి' దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన



మద్దూరు: 'భూభారతి' చట్టంలో భాగంగా రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలన మొదలైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ జయరాములు తెలిపారు. దరఖాస్తుల పరిశీలనకు డీటీ, ఆర్ఐ, ఎంఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది, వీఆర్ఐ తదితరులతో కూడిన 7 బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 250 దరఖాస్తులు మిస్సింగ్ సర్వే నెంబర్లు, విస్తీర్ణం సమస్యలు, విరాసత్ సమస్యలకు సంబంధించి రాగా పరిశీలించి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

పన్నుల చెల్లింపులో నిర్లక్ష్యం తగదు

గోపాల్‌పేట: వాహనాలపై ఉండే ట్యాక్స్‌లను ఎప్పటికప్పుడు కట్టి ప్రభుత్వానికి సహకరించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మానస సూచించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల ట్యాక్స్‌లు ఎప్పటికప్పుడు కట్టాలని, లేదంటే జరిమానాలు పెద్ద మొత్తంలో ఉంటాయని అవగాహన కల్పించారు. ట్యాక్స్‌లు సరిగా కట్టని హార్వేస్టర్, నాలుగు ట్రాక్టర్లు, రెండు ఆటోలను సేఫ్ కస్టడీ కోసం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు.

విద్యార్థులకు భీష్మరాజ్ ఫౌండేషన్ చేయూత

నారాయణపేట: పేదరికం కారణంగా చదువుకు దూరమవుతున్న విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ కృషి చేస్తుందని చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల వెలువడిన పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం తమ వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఇంటర్‌లో 989/1000 మార్కులు సాధించిన నారాయణపేట పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన విద్యార్థిని కె.పావనికి రూ.25 వేలు, సింగారం గ్రామానికి చెందిన బి.భరత్ (958/1000)కు రూ.20 వేలు, ఇంటర్ మొదటి సంవత్సరంలో దామరగిద్దకు చెందిన అక్షయకు (469/470) రూ.25 వేలు, పదో తరగతిలో వందర్‌గుట్ట తాండకు చెందిన హరిషకు (566/600), పేటలోని కార్తికేయ (566/600)కు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంతో చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తమవంతుగా విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందించినట్లు పేర్కొన్నారు.


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పిద్దాం

పేదరికంతో విద్యకు దూరమవుతున్న బడి ఈడే పిల్లలను బడిలో చేర్పించేందుకు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూన్ ఒకటో తేదీ నుంచి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాలుల వివరాలను సేకరించి వారిని పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, హన్మంతు, శివరాజ్, సంతోష్, జేవీరావు ఉన్నారు.

ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయండి



కృష్ణా: మండల కేంద్రంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించి పైప్‌లైన్ పనులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, రోడ్డు పనులను పూర్తి చేయాలని హిందుపూర్ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి బుధవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే.. చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జానయ్యను ఆదేశించారు. దీంతో రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో గ్రామ కాంగ్రెస్ నాయకులు శంఖర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, శంఖర్, కాశప్ప, వీరేష్ ఉన్నారు.

ఒండ్రుమట్టి తరలింపును నిలిపివేయాలి

ధన్వాడ: ధన్వాడ పెద్ద చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఒండ్రు మట్టి తరలింపును నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ సింధుజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు శివరాజ్ మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన నాయకుల అండతో కొందరు పెద్ద చెరువు నుంచి ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, సీనియర్ నాయకులు ఉదయ భాను, నర్సింములు, నారాయణ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చెరువును పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి గ్రామ పెద్ద చెరువును ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. కొందరు వ్యక్తులు చేపలు పట్టేందుకు చెరువులోని నీటిని వృథాగా వదిలేస్తున్నట్లు పలువురు రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఇరిగేషన్ ఎస్ఐ మహ్మద్‌గౌస్ చెరువును పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చెరువులోని సాగునీరును కిందకు వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గ్రామ పురోహితులు పటం వాదిరాజు వేద మంత్రోచ్ఛరణలు చేశారు. అనంతరం హనుమాన్ వాహనం సేవ, గరుడ వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే శ్రీ లక్ష్మీనర్సింహస్వామి విగ్రహాలు పూజారి నారాయణ ఇంటికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాకిటి వాబయ్య, ఆలంకుంట అంజనేయులు, మాజీ సర్పంచ్ రాజు, కృష్ణయ్య, ప్రహ్లద్‌రెడ్డి, రమేష్‌గౌడ్, వార్త వెంకటయ్య, బాలరాజ్, నరేందర్, నరేందరరెడ్డి పాల్గొన్నారు.


విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

విద్యుత్ ఉత్పత్తిపై శిక్షణ



దామరగిద్ద: యువ భారత్ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల జీహెచ్ఎం అశోక్‌కుమార్ అన్నారు. 14వ రోజు బుధవారం విద్యార్థులు ప్రయోగశాలలో గో మూత్రం ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ఎల్ఈడీ బల్బును వెలిగించే ప్రయోగం చేశారు. గోడ గడియారం సెల్స్ లేకుండా విద్యుత్‌తో నడిచే ప్రయోగం చేశారు. వేసవి శిక్షణలో యోగా, ధ్యానం, కంప్యూటర్ శిక్షణ, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్, న్యూమరికల్ గణిత శిక్షణ సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు


ఆత్మకూర్‌లో రైస్‌మిల్ యజమానితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఆత్మకూర్: కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని, ధాన్యం తరలింపునకు లారీల సమస్య లేకుండా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం మండలంలోని ఆరేపల్లిలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రం, పట్టణంలోని రైస్‌మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెలరోజులుగా దొడ్డురకం ధాన్యం కొనుగోలు చేయకుండా సన్నాలను మాత్రమే సేకరిస్తున్నారని రైతులు ఆయనకు వివరించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ఉండేందుకు నానా తంటాలు పడుతున్నామని, ధాన్యం తరలింపునకు లారీలు సమకూర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపునకు రోజుకు నాలుగు లారీలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ధాన్యం తరలింపులో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కేంద్రాలకు వచ్చే ధాన్యంలో తాలు, చెత్త లేకుండా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తూకం వేయాలని, వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ చాంద్‌పాషా, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లు, రైతులు ఉన్నారు.

అర్హులను ఎంపిక చేయండి



మద్దూరు/కొత్తపల్లి: మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందజేసే కుట్టుమిషన్లు అర్హులకే అందేలా చూడాలని కొత్తపల్లి ఎంపీడీఓ కృష్ణారావ్, ఉమ్మడి మండల ఎంపీఓ రామన్న, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం కొత్తపల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ కృష్ణరావ్, మద్దూరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మద్దూరు మండలంలో గతంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 289 మంది, మన్యువల్‌గా వచ్చిన 63 దరఖాస్తులను వారి ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని అదేశించారు. కార్యక్రమంలో ఉమ్మడి మద్దూరు మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్దాం

ఆత్మకూర్: పట్టణ అభివృద్ధే లక్ష్యంగా వార్డుల అధికారులు, సిబ్బంది ముందుకెళ్లాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. బుధవారం కార్యాలయంలో వార్డుల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొనకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం తగదని, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లించే విధంగా అవగాహన కల్పించాలని, ట్రేడ్ లైసెన్సులను రెన్యూవల్ చేయించాలని, పట్టణంలోని వార్డుల్లో నిత్యం పర్యటిస్తూ స్థానికులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న కమిషనర్ శశిధర్

కార్యకర్తలకు ప్రమాద బీమా

నారాయణపేట ఎడ్యుకేషన్: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డులను బుధవారం బీసీ కాలనీలో కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పార్లమెంట్ అడహాక్ కమిటీ సభ్యులు రాములు యాదవ్, రాష్ట్ర సీనియర్ నాయకులు ఓంప్రకాష్ మాట్లాడుతూ.. పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు ఈ గుర్తింపు కార్డు రెండు సంవత్సరాలు వర్తిస్తుందని, సభ్యత్వం పొందిన కార్యకర్త ఆకస్మికంగా యాక్సిడెంట్‌లో మరణిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా కార్యకర్తల పిల్లలకు ఉచిత విద్యకు అయ్యే ఖర్చులను పార్టీ భరిస్తుందన్నారు. కార్యక్రమంలో యాబన్న చౌదరి, వడ్డి నారాయణ, మజర్ కమలమ్మ, ఉషెనప్ప, చిన్నా యాదగిరి పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను విజయవంతం చేయండి

కోస్గి రూరల్: కేంద్రం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన చట్టాలు, ప్రజావేతిరేక విధానాలకు నిరసనగా మే 20న చేపట్టిన జాతీయ సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కార్మిక, కర్షక, స్వతంత్ర సంఘాల ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో బుస్స చంద్రయ్య, నారాయణ, శ్రీనివాస్, బాలప్ప, అశోక్ ఉన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్ బస్టాండ్‌లో తనిఖీలు

మాగనూర్(మక్తల్): మక్తల్ బస్టాండ్‌లో దొంగతనాలు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మక్తల్ పోలీస్ కానిస్టేబుల్ మహేష్ తెలిపారు. బుధవారం మక్తల్ బస్టాండ్‌లో ఫింగర్ ప్రింట్ డివైసతో తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతాలకు పాల్పడుతున్నారని అలాంటి వారిని చెక్ పెట్టడానికి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు బస్సు ఎక్కి, దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవం



చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో వినాయకుడి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణం కోసం సహకరించిన గ్రామస్తులు శ్రీనివాస్‌రావు, చుక్కరావు ను మంత్రి శాలువాతో సత్కరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.కార్యక్రమంలో కళ్యాణ్‌రావు, విద్యాసాగర్ రావు, ధర్మారెడ్డి, రమణయ్య, హన్మంత్‌రావు, శివారెడ్డి, భగవంత్‌రెడ్డి, సతీష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నరేష్ కుమార్, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన ముళ్ల పొదలు



మరికల్: లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ముళ్ల పొదలతో నిండిపోయింది. లాల్‌కోట చౌరస్తా నుంచి కోయిల్‌సాగర్ వరకు 20 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డు అడుగడుగున గుంతలతో పాటు రోడ్డుకు ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోయాయి. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



మాగనూర్(మక్తల్): నారాయణపే జిల్లా మక్తల్ మండల గుడిగండ్ల గ్రామ ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. రాయచూర్ నుంచి బాలనగర్‌కు తౌడ్ లోడ్ తీసుకెళ్తుండగా డ్రైవర్ నిద్ర మత్తులో అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో లారీ బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సాయంతో లారీని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అమరచింత: సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసేందుకు మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పర్యటించనున్నట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.